APTEL/2009/29308

# స్నేహిత ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు

తెలుగు దినపత్రిక

04.01.2026
ఆదివారం
హైదరాబాద్
సంపుటి : 17 సంచిక: 75
పేజీలు: 4 వెల: రూ.5
ఎడిటర్ : రాథోడ్ వినోద్ కుమార్

Follow:
https://epaper.expresstelugudaily.com



**పట్టుదలతో లక్ష్యం సాధ్యం: జిల్లా కలెక్టర్** 03

తెలంగాణ శాసనసభలో శనివారం చర్చ రసవత్తరంగా సాగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో ఫైర్ బ్రాండ్ ప్రసంగం చేస్తూ ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలపై విరుచుకుపడ్డారు. ముఖ్యంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తోలు తీస్తానని అంటున్నారని ప్రస్తావిస్తూ.. ప్రజా ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నిస్తే చూస్తూ ఊరుకోబోమని, అడ్డగోలుగా మాట్లాడితే నాలుక కోస్తామని అత్యంత ఘాటుగా హెచ్చరించారు. అయితే, ఇదే సమయంలో రాజకీయ విశ్లేషకులు కేసీఆర్ గారి సుదీర్ఘ రాజకీయ అనుభవాన్ని, తెలంగాణ ఉద్యమకారుడిగా ఆయనకున్న పట్టును గుర్తు చేస్తున్నారు. కేసీఆర్ గారు గత పదేళ్లలో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించారని, మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపారని బీఆర్ఎస్ శ్రేణులు వాదిస్తున్నాయి. రేవంత్ రెడ్డి గర్జించినా.. కేసీఆర్ గారు నిర్మించిన కాళేశ్వరం లాంటి భారీ ప్రాజెక్టులు తెలంగాణ సాగునీటి రంగంలో మైలురాళ్లుగా నిలిచిపోతాయని, ఆ అభివృద్ధిని ఎవరూ చెరిపివేయలేరని మేధావుల అభిప్రాయం.

# తోలు తీస్తామంటే నాలుక కోస్తాం!




- కేసీఆర్ తోలు వ్యాఖ్యలపై సీఎం రేవంత్ ఆగ్రహం
- ప్రజా ప్రభుత్వ చిత్తశుద్ధిని శంకిస్తే చూస్తూ ఊరుకోం
- నన్ను ఇంగ్లీష్ రాదని ఎగతాళి చేస్తారా? బాత్రూం కడిగే వాడికి కూడా వస్తుంది
- మెస్సీకి ఇంగ్లీష్ రాదు.. అతను గొప్పవాడు కాదా?
- చైనా, జర్మనీ దేశాలకు ఇంగ్లీష్ రాకపోయినా ప్రపంచాన్ని ఏలడం లేదా?
- నేను ఇంగ్లీష్ నేర్చుకోలేదేమో.. కానీ మీ దోపిడీని అరికట్టే విద్య బాగా తెలుసు
- దేవుడి మీద ఆన.. రాష్ట్రంలో ఎవరికీ నష్టం జరగనివ్వను
- ప్రాజెక్టులు అంచనాలు పెంచి దోచుకోవడంలో పాత నేరస్తుల ప్యాటర్న్
- తెలంగాణ ప్రయోజనాలే సుప్రీం.. అడ్డగోలుగా ఎవరు మాట్లాడినా సహించేది లేదు
- అసెంబ్లీలో రెచ్చిపోయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెడ్డి

02

## పాలమూరుపై కేసీఆర్ రాసింది మరణశాసనం

- కమిషన్ల కోసం కాళేశ్వరం.. కన్నీళ్ల కోసం పాలమూరు
- జగన్‌తో భేటీలు వేసి తెలంగాణ హక్కులను తాకట్టు పెట్టిన కేసీఆర్
- రూ.7 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టులను రూ.84 వేల కోట్లకు చేర్చిన ఘనత
- బీఆర్ఎస్ చేసిన అప్పుల ఊబి నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కిస్తాం
- ఏపీ అక్రమంగా నీరు తరలించుకుపోతుంటే కేసీఆర్ ఎందుకు మౌనంగా ఉన్నారు?
- నల్లమలసాగర్‌పై అవాస్తవాలు చెబితే ఊరుకోం.. ఒక్క చుక్క నీటిని వదులుకోబోం
- భూసేకరణ, అనుమతులు లేకుండానే డీపీఆర్లు బీఆర్ఎస్ పంపింది
- అవాస్తవాలు నమ్మవద్దు.. ఈ టర్మ్ లోనే కృష్ణా బేసిన్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం
- అసెంబ్లీ పవర్ ఫుల్ ప్రజెంటేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

02



## ప్రజలకు ఏం చెబుతాం?



02

- అసెంబ్లీ లాబీల్లో ఎమ్మెల్యేల షికార్లు!
- కీలక చర్చ జరుగుతుంటే బయట తిరగడమేంటి?
- ఎమ్మెల్యేల తీరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం
- ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చవద్దని స్ట్రాంగ్ వార్నింగ్
- ప్రజలు అన్నీ గమనిస్తున్నారు.. బాధ్యతగా ఉండకపోతే చర్యలే అంటూ హెచ్చరికలు
- చర్చ జరుగుతున్నా కాంగ్రెస్ ఎమ్మెల్యేల గైర్హాజరుపై సీఎం అసంతృప్తి

## కూనంనేని సారీ చెప్పాల్సిందే..

- మోదీపై చేసిన వ్యాఖ్యలు హేయమైనవి
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపాటు



హైదరాబాద్, స్నేహిత ఎక్స్ ప్రెస్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలు హేయమైనవని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. కూనంనేని బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కిషన్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా డిమాండ్ చేశారు. రాజకీయాల్లో హుందాతనం అవసరమన్న కేంద్రమంత్రి.. ప్రధానమంత్రిపై వ్యక్తిగత దూషణలు, అర్థంలేని ఆరోపణలు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. శాసనసభ స్పీకర్ దీనిపై జోక్యం చేసుకుని మరెవరూ.. ఇలాంటి అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయకుండా, సభా మర్యాదలు పాటించేలా చొరవ తీసుకోవాలని కోరారు.

## అసెంబ్లీ సాక్షిగా అబద్ధాల వరద



- సీఎం రేవంత్ భాష అత్యంత జుగుప్సాకరం
- సీఎం వ్యాఖ్యలపై హరీష్ రావు ధ్వజం

హైదరాబాద్, స్నేహిత ఎక్స్ ప్రెస్: అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి అత్యంత జుగుప్సాకరమైన, అసభ్యకరమైన భాషలో అబద్ధాల వరద పారించారని ఆయన మండిపడ్డారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద హరీష్ రావు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బూతు పదాలకు ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలి ప్రజాస్వామ్య దేవాలయమైన అసెంబ్లీలో 'భడివె' వంటి పరమ బూతు పదాలను, 'నాలుక కోస్తా' వంటి నేర ప్రవృత్తితో కూడిన భాషను వాడటం రేవంత్ రాజకీయ నీచత్వానికి పరాకాష్ట అని హరీష్ రావు విమర్శించారు. ఒక ముఖ్యమంత్రి ఇంత వికృతంగా మాట్లాడుతుంటే స్పీకర్ వారించకపోవడం దురదృష్టకరమని, రేవంత్ రెడ్డి వెంటనే సభ్య సమాజానికి భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇరిగేషన్ అంశాలపై కనీస అవగాహన లేదు.

మిగతా 2లో..

## వైద్యరంగంలో కూటమి మార్క్

- డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ వ్యయంలో 60 శాతం పెరుగుదల
- 21 శాతం పెరిగిన లబ్ధిదారులు.. నెలవారీ ఖర్చు రూ.310 కోట్లకు చేరిక
- 108 సేవల్లో విప్లవాత్మక మార్పులు.. 95 శాతం మంది రోగులు గంటలోపే ఆసుపత్రికి
- 104 వాహనాల ద్వారా త్వరలో ఇంటి వద్దే 41 రకాల వైద్య పరీక్షలు
- ఏపీ హెల్త్ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

02






## కొండగట్టు అంజన్న మా ఇలవేల్పు

- ఆయన దయ వల్లే నాకు పునర్జన్మ
- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- రూ.35.19 కోట్ల టీటీడీ నిధులతో అభివృద్ధి పనులు
- వాయుపుత్ర సదన్, దీక్ష విరమణ మండపాలకు శంకుస్థాపన
- గిరి ప్రదక్షిణ మార్గం సుగమం చేస్తానని హామీ


02

## గంజాయి చిక్కుల్లో ఎమ్మెల్యే పుత్రరత్నం!

- డ్రగ్స్ కేసులో ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కుమారుడు
- నానక్‌రామ్‌గూడలో 'ఈగల్ టీమ్' మెరుపు దాడులు
- సుధీర్ రెడ్డికి గంజాయి పాజిటివ్.. వెంటనే డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలింపు
- డ్రగ్స్ నెట్‌వర్క్‌పై ఆరా తీస్తున్న పోలీసులు.. తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా అరెస్ట్

02





## పేదల పొట్ట కొట్టొద్దు..

- బీజీరామ్ జీ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి
- రాష్ట్రాలపై రూ.1,789 కోట్ల అదనపు భారం
- కేంద్రం అమలు చేసేది 75 రోజులేనని సీతక్క వెల్లడి
- ఎంజీఎన్ఆర్ఈజీఏను యథాతథంగా కొనసాగించాలని మండలిలో తీర్మానం



హైదరాబాద్, స్నేహిత ఎక్స్ ప్రెస్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై రాష్ట్రాల అభిప్రాయం తీసుకోకుండా పేరు మార్చుతూ వీబీజీరామ్ జీ కొత్త చట్టాన్ని తీసుకొచ్చారని, దీన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. శనివారం శాసన మండలిలో స్వల్పకాలిక చర్చలో భాగంగా గ్రామీణ ప్రాంత పేదల జీవనాధారమైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని (ఎంజీఎన్ఆర్ఈజీఏ) యథాతథంగా కొనసాగించాలని కోరుతూ మంత్రి సీతక్క శాసనమండలిలో తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. ఉపాధి హామీ పథకానికి గతంలో కేంద్రమే పూర్తి నిధులు కేటాయించేదని, కానీ ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర వాటాను 60:40 నిష్పత్తికి మార్చడం రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారాన్ని మోపడమేనని సీతక్క పేర్కొన్నారు. గత 20 ఏళ్లుగా ఈ పథకం ద్వారా లబ్ధి పొందిన వారిలో 90 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారుండగా, అందులో 62 శాతం మహిళలు ఉన్నారు. కొత్త చట్టం వల్ల ఈ వర్గాల ఉపాధికి హామీ లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టం కింద రాష్ట్ర వాటా 532.13 కోట్లు కాగా, వీబీజీరామ్ జీ కింద రాష్ట్ర వాటా రూ.2320.10 కోట్లుగా ఉందని, దీంతో రాష్ట్ర ప్రభుత్వంపై రూ. 1789 కోట్ల అదనపు భారం పడుతుందన్నారు. కేంద్రం వంద రోజుల నుంచి 125 రోజులు పని దినాలు చేశామని గొప్పలు చెప్పుకుంటుందని, కానీ కేంద్రం అమలు చేసేది 75 రోజులేనని స్పష్టం చేశారు.

# కొండగట్టు అంజన్న మా ఇలవేల్పు

**జగిత్యాల, స్నేహిత ఎక్స్ ప్రెస్:**
జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శనివారం కొండగట్టుకు ఆంజనేయ స్వామి దేవస్థానాన్ని సందర్శించారు. టీటీడీ నిధులు రూ.35 కోట్లతో నిర్మించనున్న 96 గదుల వాయుపుత్ర సదన్, భారీ మాల విరమణ మండపాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. కొండగట్టు ఆంజనేయ స్వామి తమ ఇలవేల్పు అని అన్నారు. 'అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నామంటే దేవుడి దయ ఉండాలి. కొండగట్టు నాకు పునర్జన్మనిచ్చింది. గతంలో జరిగిన విద్యుత్ ప్రమాదం నుంచి నేను ఎలా బయటపడ్డానో ఇప్పటికీ ఆశ్చర్యం కలిగిస్తోంది. కొండగట్టు అంజన్నే నన్ను కాపాడారు. దీక్ష విరమణకు మండపం, సత్రం కావాలని గతంలో నన్ను కోరారు. టీటీడీ సభ్యులు, తెలంగాణ నాయకులు అందరి సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది' అని పవన్ పేర్కొన్నారు. కొండగట్టు ఆంజనేయ స్వామి దయతో తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. గిరి ప్రదక్షిణ మార్గం సుగమం చేయడానికి అవసరమైతే తానే స్వయంగా కరసేవకుడిగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. కొండగట్టు ఆలయానికి నిధులు కేటాయించినందుకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, టీటీడీ పాలక మండలికి కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏపీ శాసన మండలి విప్ పిడుగు హరిప్రసాద్, టీటీడీ బోర్డు సభ్యులు బి.ఆనందసాయి, బి.మహేందర్ రెడ్డి, టీటీడీ ఎల్ఏసీ చైర్మన్ ఎన్.శంకర్ గౌడ్, ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కల్యాణం శివ శ్రీనివాస్, జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్, అదనపు కలెక్టర్ బి.రాజాగౌడ్, ఆలయ ఈవో తదితరులు పాల్గొన్నారు.

**జనసేన కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం**
కొండగట్టు ఆలయం నుంచి నేరుగా నాచుపల్లి శివారులోని ప్రైవేట్ రిసార్టులో జనసేన కార్యకర్తలతో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పవన్ కల్యాణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన జనసేన మద్దతుదారులను పవన్ ప్రశంసించారు. రానున్న రోజుల్లో తెలంగాణలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ పార్టీ ఇన్‌చార్జి శంకర్ గౌడ్, నాయకులు సాగర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు పవన్ కల్యాణ్ హెలికాప్టర్‌లో హైదరాబాద్ వెళ్లారు.



# ప్రజలకు ఏం చెబుతాం?

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్ ప్రెస్:**
తెలంగాణ శాసనసభ సమావేశాల సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేల ప్రవర్తనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శనివారం అసెంబ్లీలో 'నీళ్లు నిజాలు'పై స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ జరుగుతున్న సమయంలో పలువురు ఎమ్మెల్యేలు సభలో ఉండకుండా లాబీల్లో తిరగడంపై సీఎం రేవంత్ సీరియస్‌గా స్పందించారు. ప్రభుత్వం కీలక అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తున్న సమయంలో.. కొందరు ఎమ్మెల్యేలు సభకు గైర్హాజరు కావడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు సీఎం రేవంత్‌రెడ్డి. ఇది ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగించే అంశమని పేర్కొన్నారు. ప్రజలు అసెంబ్లీ సమావేశాలను గమనిస్తున్న వేళ ఎమ్మెల్యేలు మరింత బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. సభలో లేని ఎమ్మెల్యేల తీరు.. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధమని వ్యాఖ్యానించారు.

**క్రమశిక్షణ, హాజరు తప్పనిసరి..**
ప్రభుత్వ కార్యక్రమాలు, విధానాలపై చర్చ జరుగుతున్నప్పుడు ఎమ్మెల్యేలు తప్పనిసరిగా సభలో ఉండాలని, ప్రజలకు జవాబుదారీతనం చూపించాల్సిన అవసరం ఉందని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ విప్‌లకు ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. వెంటనే లాబీల్లో ఉన్న ఎమ్మెల్యేలందరినీ సభలోకి పిలిపించాలని, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విప్‌లను ఆదేశించారు. శాసనసభలో క్రమశిక్షణ, హాజరు తప్పనిసరని స్పష్టం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, అభివృద్ధి ప్రణాళికలు ప్రజల ముందుకు తీసుకెళ్లే బాధ్యత ఎమ్మెల్యేలపై ఉందని సీఎం గుర్తు చేశారు. అలాంటి సమయంలో సభకు దూరంగా ఎమ్మెల్యేలు ఉండటం సరైన పద్ధతి కాదని చెప్పుకొచ్చారు. ప్రతి ఎమ్మెల్యే పార్టీకి, ప్రభుత్వానికి జవాబుదారుడుగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.



# పాలమూరుపై కేసీఆర్ రాసింది మరణశాసనం

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్ ప్రెస్:**
బీఆర్ఎస్ పార్టీ కృష్ణా బేసిన్ జలద్రోహి అని.. పాలమూరు ప్రజలకు కేసీఆర్ మరణశాసనం రాశారని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం అసెంబ్లీలో ఆయన కృష్ణా జలాలు, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై సమగ్రమైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గత పదేళ్లలో సాగునీటి రంగంలో జరిగిన విధ్వంసాన్ని గణాంకాలతో సహా వివరించారు.

**పదేళ్లలో రూ.1.87 లక్షల కోట్ల ఖర్చు.. ఫలితం శూన్యం!**
2014లో కేసీఆర్ అధికారంలోకి వచ్చిన వెంటనే కేవలం రూ.7,469.38 కోట్లు ఖర్చు పెట్టి ఉంటే ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయిలాసాగర్ వంటి పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తయ్యేవని మంత్రి తెలిపారు. తద్వారా 8.65 లక్షల ఎకరాలకు నీరు అందేదన్నారు. కానీ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.1.87 లక్షల కోట్లు సాగునీటి ప్రాజెక్టుల పేరిట ఖర్చు చేసినప్పటికీ, ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు మాత్రం మొండి చేయి చూపారని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలకులు ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం 11 శాతం వడ్డీ రేటుకు అప్పులు తీసుకొస్తే.. తాము అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలో ఇరిగేషన్ శాఖకు కేటాయించిన రూ.24 వేల కోట్లలో రూ.10 వేల కోట్లు వడ్డీల కిందనే సరిపోయాయని గుర్తుచేశారు. అప్పుల వడ్డీ రేటును 7 శాతానికి తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని వెల్లడించారు.



**కాళేశ్వరంపై మోజుతో పాలమూరుకు అన్యాయం**
కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుపై ఉన్న మోజుతో పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఉత్తమ్ విమర్శించారు. పదేళ్లలో కాళేశ్వరం కోసం రూ.90వేల కోట్లు వెచ్చిస్తే.. పాలమూరుపై కేవలం రూ.27 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని వివరించారు. కాళేశ్వరం పబ్లిక్ హియరింగ్ 2017లోనే నిర్వహిస్తే, పాలమూరుకు 2021 వరకు జాప్యం చేశారన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నాయని పబ్లిక్ హియరింగ్‌ను క్యాన్సిల్ చేయడం విడ్డూరమని ఎద్దేవా చేశారు. జూరాల వద్దనే పాలమూరు సోర్స్ పాయింట్ ఉంటే రోజుకు 2.8 టీఎంసీల నీటి లభ్యత ఉండేదని, 10 లక్షల ఎకరాలకు నీరు అందేదని చెప్పారు. కేవలం రూ.32 వేల కోట్లతో ఆ ప్రాజెక్టు పూర్తయ్యేదని, కానీ దానిని శ్రీశైలం వద్దకు మార్చి మహబూబ్‌నగర్‌కు తీవ్ర అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**30 శాతం పనులు మాత్రమే పూర్తి.. కుర్చీ ఏమైంది?**
పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టులో ఒక పంపు ఆన్ చేసి ఆపేశారని మంత్రి వెల్లడించారు. బీఆర్ఎస్ రూ.26,262 కోట్లు ఖర్చు చేసినా, అది మొత్తం అంచనాలో కేవలం 32 శాతమే అని, ఇంకా 39 వేల ఎకరాల భూసేకరణ పెండింగ్‌లో ఉందని స్పష్టం చేశారు. 2016లో శంకుస్థాపన చేసినప్పుడు మూడేళ్లలో పూర్తి చేస్తామని కేసీఆర్ ప్రకటించారని, కానీ ఇప్పటికీ 30 శాతం పనులే పూర్తయ్యాయని తెలిపారు. కేసీఆర్ కుర్చీ వేసుకుని ప్రాజెక్టు కట్టిస్తానని చెప్పారని, కానీ ఆ కుర్చీ ఎటు పోయిందో, ఆయన ఎటు పోయారో తెలియదని ఎద్దేవా చేశారు. ప్రస్తుత అంచనాల మేరకు ఈ ప్రాజెక్టు పూర్తి కావాలంటే రూ.84 వేల కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు.

**ఏపీ దోపిడీకి బీఆర్ఎస్ సహకారం..**
2014కు ముందు కృష్ణా బ్యాక్ వాటర్ నుంచి ఏపీ అక్రమంగా రోజుకు 4.47 టీఎంసీలు తరలించగా, పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో దానిని 13 టీఎంసీలకు పెంచుకునేలా ఏపీకి అవకాశం ఇచ్చారని వెల్లడించారు. రాయలసీమ లిఫ్ట్ ద్వారా నీటిని దోచుకుంటుంటే బీఆర్ఎస్ నిశ్శబ్దంగా ఉందని, తాము వచ్చాక ఒత్తిడి తెచ్చి పనులు నిలిపివేయించామని చెప్పారు. గత 12 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా 202425లో తెలంగాణ 266 టీఎంసీలను వినియోగించిందని తెలిపారు. 201424 వరకు ఏపీ 11,900 టీఎంసీలు తరలించిందని, ఇందులో బీఆర్ఎస్ నిర్వాకం స్పష్టంగా కనిపిస్తోందన్నారు.

**ట్రిబ్యునల్ ముందు పోరాటం - 763 టీఎంసీలే లక్ష్యం!..**
కృష్ణా నదీ జలాల్లో 73 శాతం (763 టీఎంసీలు) తెలంగాణకే కేటాయించాలని తాము ట్రిబ్యునల్ ముందు గట్టిగా వాదిస్తున్నామని ఉత్తమ్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో 299 టీఎంసీలకే ఒప్పుకొని ద్రోహం చేశారన్నారు. తాము వచ్చాకే 555 టీఎంసీలు కావాలని కొట్లాడుతున్నామని, మొత్తం నీటి లభ్యత 1,050 టీఎంసీల ప్రకారం చూస్తే మాకు 763 టీఎంసీలు రావాలని కోరుతున్నట్లు చెప్పారు. ఏడాదిలోపే ఫైనల్ తీర్పు వస్తుందని, జల వివాదాలకు ఫుల్ స్టాప్ పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**మూడేళ్లలో ప్రాజెక్టులు పూర్తి - నల్లమలసాగర్‌పై క్లారిటీ..**
వచ్చే మూడేళ్లలో 90 టీఎంసీల లక్ష్యంతో పాలమూరురంగారెడ్డిని ఒరిజినల్ షేప్‌తో పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. తాము అధికారంలోకి వచ్చాక రూ.7వేల కోట్లు ఈ ప్రాజెక్టుపై ఖర్చు చేశామని, డిండికి రూ.1800 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. నల్లమలసాగర్‌పై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని, ఆ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు రాలేదని స్పష్టం చేశారు. దీనిపై తాము సుప్రీంకోర్టుకు వెళ్లామని, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఒక్క చుక్క నీటిని కూడా వదులుకోబోమని ఉత్తమ్ తేల్చిచెప్పారు.

# అసెంబ్లీ సాక్షిగా అబద్ధాల వరద

( మొదటిపేజీ తరువాయి )
నీటి పారుదల ప్రాజెక్టుల విషయంలో ముఖ్యమంత్రికి 'బేసిక్ నాలెడ్జ్' లేదని హరీష్ రావు ఎద్దేవా చేశారు. "రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌పై బీఆర్ఎస్ న్యాయపోరాటం చేసి స్టే తెస్తే, అది తన ఘనకార్యంగా రేవంత్ చెప్పుకోవడం సిగ్గుచేటు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును కాంగ్రెస్ తెచ్చిందనడం పిచ్చిప్రేలాపన తప్ప మరొకటి కాదు. 2009 నుండి 2014 వరకు డీపీఆర్ ఇవ్వడానికే ఐదేళ్లు తీసుకున్న చరిత్ర కాంగ్రెస్ ది" అని ఆయన గుర్తు చేశారు.

**రేపు పీపీటీతో అసలు నిజాలు బయటపెడతాం**
అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ అంశాలను వక్రీకరిస్తూ సభను తప్పుదోవ పట్టించేందుకు సీఎం ప్రయత్నించారని హరీష్ రావు ఆరోపించారు. ముఖ్యమంత్రి 'పిట్ట కథలకు', మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 'కట్టు కథలకు' రేపు తెలంగాణ భవన్ వేదికగా సాక్ష్యాధారాలతో కూడిన పీపీటీ ద్వారా తగిన సమాధానం ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ రథసారథి కేసీఆర్ చిత్తశుద్ధిని ప్రశ్నించడం అంటే సూర్యుడి మీద ఉమ్మేయడమేనని హరీష్ రావు హితవు పలికారు.



# గంజాయి చిక్కుల్లో ఎమ్మెల్యే పుత్రరత్నం!

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్ ప్రెస్:**
భాగ్యనగరంలోని నానక్‌రామ్‌గూడలో శనివారం ఈగల్ టీమ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించింది. ఈ సోదాల్లో బీజేపీ జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కుమారుడు సుధీర్‌రెడ్డి డ్రగ్స్ తీసుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో సుధీర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని చెక్ చేశారు. ఈ పరిశీలనలో సుధీర్‌రెడ్డికి డ్రగ్స్ పాజిటివ్ వచ్చింది. వెంటనే ఆయనని అరెస్ట్ చేసి, డీఅడిక్షన్ సెంటర్‌కి తరలించారు. సుధీర్‌రెడ్డితో పాటు మరో వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం సుధీర్‌రెడ్డిని పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. ఆయనకు డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చాయి, ఎవరు సరఫరా చేశారనే కోణంలో పోలీసులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సుధీర్‌రెడ్డి డ్రగ్స్ కేసు ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

**డిప్రెషన్‌లో ఉన్నట్లు గుర్తింపు..**
కాగా, సుధీర్‌రెడ్డి గత కొంతకాలంగా డిప్రెషన్‌లో ఉన్నట్లు ఈగల్ టీమ్ గుర్తించింది. ఈగల్ టీమ్‌కి వచ్చిన ఫోన్ కాల్‌తో సుధీర్‌రెడ్డి ఇంట్లో సోదాలు కొనసాగాయి. ఈ క్రమంలో ఆయనతో పాటు ఇంట్లో ఉన్న మరో ఇద్దరు స్నేహితులని అరెస్ట్ చేశారు. సుధీర్‌రెడ్డికి మాత్రమే గంజాయి



పాజిటివ్, మిగిలిన ఇద్దరు స్నేహితులకు నెగిటివ్‌గా నిర్ధారించారు. సుధీర్‌రెడ్డిని డీ అడిక్షన్ సెంటర్‌కి తరలించారు. సోదాల సమయంలో డ్రగ్స్, గంజాయి దొరకలేదని ఈగల్ టీమ్ అధికారులు చెబుతున్నారు. డిప్రెషన్ కారణంగానే డ్రగ్స్‌కి సుధీర్‌రెడ్డి అలవాటు పడినట్లు తెలిపారు. సుధీర్‌రెడ్డి ఈ కేసులో పట్టుబడిన తర్వాత కుటుంబ సభ్యులకు ఈగల్ టీమ్ అధికారులు సమాచారం ఇచ్చారు. ఈ ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. ఈ నేపథ్యంలో రాజకీయ కుటుంబ సభ్యుల డ్రగ్స్ వినియోగంపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇలాంటి ఘటనలు బయటకు రావడంతో యువతపై ప్రభావం చూపించే డ్రగ్స్‌ను అరికట్టడానికి ప్రభుత్వం, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు సూచిస్తున్నారు.

# పార్కు స్థలాలను కాపాడిన హైడ్రా

**రూ. 35 కోట్ల విలువైన స్థలాల చుట్టూ ఫెన్సింగ్**

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్ ప్రెస్:**
కూకట్‌పల్లి పరిధిలోని 3 వేల గజాల విస్తీర్ణంలో ఉన్న రెండు పార్కులను హైడ్రా శనివారం కాపాడింది. ఇలా కాపాడిన భూమి విలువ రూ. 35 కోట్ల వరకూ ఉంటుంది. భాగ్యనగర్ ఫేజ్-3 కాలనీలో రెండు పార్కులు కబ్జాకు గురయ్యాయని హైడ్రా ప్రజావాణికి అక్కడి నివాసితుల సంక్షేమ సంఘం ఫిర్యాదు చేసింది. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారి ఆదేశాల మేరకు వివిధ శాఖలతో హైడ్రా అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సర్వే నంబరు 197తో పాటు 200లలో 36 ఎకరాలలో భాగ్యనగర్ ఫేజ్ 3 పేరిట హుడా అనుమతి పొందిన లే ఔట్ 1987లో ఏర్పడింది.



357 ప్లాట్లతో ఏర్పడిన ఈ కాలనీలో రెండు పార్కులు ఆక్రమణకు గురయినట్టు గుర్తించారు. 2 వేల గజాల పార్కులో సగం వరకూ కబ్జా అవ్వగా.. ఎకరం విస్తీర్ణంలో ఉన్న పార్కులో వెయ్యి గజాల వరకూ ఆక్రమణకు గురైనట్టు పేర్కొంటూ నివేదిక సమర్పించారు. ఈ నివేదిక మేరకు హైడ్రా కమిషనర్ గారి ఆదేశాలతో శనివారం ఈ ఆక్రమణలను అధికారులు తొలగించారు. రెండు పార్కుల చుట్టూ ఫెన్సింగ్ వేసి పార్కు స్థలాలుగా పేర్కొంటూ హైడ్రా బోర్డులను అధికారులు ఏర్పాటు చేశారు. ప్రాణవాయువును అందించే పార్కులను కాపాడిన హైడ్రాకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# తోలు తీస్తామంటే నాలుక కోస్తాం!



**హైదరాబాద్, స్నేహిత ఎక్స్ ప్రెస్:**
భాష విషయంలో తనపై వస్తున్న విమర్శలకు రేవంత్ రెడ్డి ఇచ్చిన సమాధానం సభలో చర్చనీయాంశమైంది. తనకు ఇంగ్లీష్ రాదని హేళన చేస్తున్న వారికి గ్లోబల్ ఉదాహరణలతో కౌంటర్ ఇచ్చారు. "భాష అనేది కేవలం కమ్యూనికేషన్ కోసం మాత్రమే.. మెస్సీకి ఇంగ్లీష్ రాదు, జర్మనీ, జపాన్ వాళ్లకు రాదు.. అంత మాత్రాన వారు గొప్పవారు కాదా?" అని ప్రశ్నించారు. అమెరికాలో బిచ్చమెత్తుకునే వాడికి కూడా ఇంగ్లీష్ వస్తుందని, దమ్ముంటే వారిని తెలుగులో మాట్లాడమనాలని సవాల్ చేశారు. అయితే, ఈ విమర్శలపై బీఆర్ఎస్ నేతలు స్పందిస్తూ.. గ్లోబల్ లీడర్ గా కేసీఆర్ గారు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో అనర్గళంగా ప్రసంగిస్తూ జాతీయ స్థాయిలో తెలంగాణ గౌరవాన్ని పెంచారని, భాషా పాండిత్యం అనేది ఒక నాయకుడి హుందాతనాన్ని పెంచుతుందని గుర్తు చేస్తున్నారు. కేసీఆర్ గారి వాగ్ధాటి తెలంగాణ సంస్కృతిని, గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పిందని, ఆ స్థాయిని అందుకోవడం ఎవరికైనా కష్టమేనని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి.

**నేరం చేసే వాడికి ఒక 'ప్యాటర్న్'...**
అవినీతి విమర్శల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి 'అతడు' సినిమా కథను ఉదహరించడం సభలో హాస్యాన్ని, ఆసక్తిని కలిగించింది. నేరం చేసే వాడికి ఒక 'ప్యాటర్న్' ఉంటుందని, ప్రాజెక్టుల అంచనాలు పెంచి దోచుకోవడంలోనూ అదే విధానాన్ని అనుసరించారని కేసీఆర్ గారిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. జేబులు కొట్టే వాడికి ఉండే మనస్తత్వమే ఇక్కడ కనిపిస్తోందని విమర్శించారు. దీనికి భిన్నంగా, కేసీఆర్ గారి మద్దతుదారులు మాత్రం ఈ వ్యాఖ్యలను ఖండిస్తున్నారు. ప్రాజెక్టుల రీడిజైనింగ్ అనేది రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడానికి తీసుకున్న సాహసోపేత నిర్ణయమని, కేవలం విమర్శల కోసమే సినిమా కథలను ఉదహరించడం సరికాదని వారు అంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎడారిగా ఉన్న తెలంగాణను కోటి ఎకరాల మాగాణీగా మార్చిన ఘనత కేసీఆర్ గారిదేనని, ఆ ప్రాజెక్టుల వల్ల లబ్ధి పొందుతున్న లక్షలాది మంది రైతుల కళ్ళలో ఆనందమే కేసీఆర్ గారికి అసలైన సాక్ష్యమని వారు గట్టిగా చెబుతున్నారు.

**దేవుడి మీద ఆన వేసి పని చేస్తా..**
మొత్తానికి రేవంత్ రెడ్డి తన ప్రసంగం ద్వారా బీఆర్ఎస్ సభలో లేకపోయినా వారికి పవర్‌ఫుల్ పంచ్‌లు, వార్నింగ్‌లు ఇచ్చేశారు. తెలంగాణ ప్రయోజనాల కోసం దేవుడి మీద ఆన వేసి పని చేస్తానని, ఎవరికీ నష్టం కలగనివ్వనని భరోసా ఇచ్చారు. ఈ రాజకీయ పోరులో ఒకవైపు రేవంత్ రెడ్డి వేగం, మరోవైపు కేసీఆర్ రాజకీయ చతురత తెలంగాణ రాజకీయాలను రసకందాయంలో పడేశాయి. విమర్శలు, ప్రతివిమర్శలు ఎలా ఉన్నా.. తెలంగాణ అభివృద్ధి కోసం అటు కేసీఆర్ గారు వేసిన పునాదులు, ఇటు రేవంత్ రెడ్డి వేస్తున్న అడుగులు వెరసి రాష్ట్ర భవిష్యత్తు ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారింది. శాసనసభ వేదికగా జరిగిన ఈ 'మాటల యుద్ధం' సోషల్ మీడియాలో అత్యంత వేగంగా వైరల్ అవుతూ ప్రజల్లో సరికొత్త చర్చకు దారితీసింది.

# వైద్యరంగంలో కూటమి మార్క్

- డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ వ్యయంలో 60 శాతం పెరుగుదల
- 21 శాతం పెరిగిన లబ్ధిదారులు.. నెలవారీ ఖర్చు రూ.310 కోట్లకు చేరిక
- 108 సేవల్లో విప్లవాత్మక మార్పులు.. 95 శాతం మంది రోగులు గంటలోపే ఆసుపత్రికి
- 104 వాహనాల ద్వారా త్వరలో ఇంటి వద్దే 41 రకాల వైద్య పరీక్షలు
- ఏపీ హెల్త్ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

**అమరావతి, స్నేహిత ఎక్స్ ప్రెస్:**
కూటమి ప్రభుత్వ నిరంతర పర్యవేక్షణతో ప్రజలకు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉచిత వైద్య సేవలు అందించడంలో సానుకూల మార్పు స్పష్టంగా కనిపిస్తోందని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ఈ పథకం కింద కూటమి ప్రభుత్వ పాలనలో భారీగా పెరిగిన వ్యయం, లబ్ధిదారుల సంఖ్యే ఇందుకు నిదర్శనమని మంత్రి తెలిపారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవల అమలును, 108 మరియు 104 సేవలను శనివారం వర్చువల్ గా సంబంధిత అధికారులతో మంత్రి వివరంగా సమీక్షించారు. 108 సేవలకు సంబంధించిన టెండర్‌లో కూటమి ప్రభుత్వం గతానికి భిన్నంగా కఠినమైన నిబంధనలు విధించడంతో ఈ సేవలు ఎంతో మెరుగుపడ్డాయని వివరించారు. గత వైసిపి ప్రభుత్వం డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రొసీజర్ల సంఖ్యను 3,257కు పెంచి పూర్తి స్థాయిలో అమలు పరచిన 202224 కాలం నాటి ఫలితాలను, గత 19 నెలల కూటమి పాలనలో సాధించిన ఫలితాలను మంత్రి తులనాత్మకంగా విశ్లేషించారు. 202224 కాలంలో నెలకు సగటున 96,205 మంది లబ్ధి పొందగా, కూటమి ప్రభుత్వ పాలనలో గతేడాది డిసెంబర్ వరకు సగటున నెలకు 1,16,624 మందికి నగదు రహిత వైద్య సేవలు అందాయి. దీనివల్ల లబ్ధిదారుల సంఖ్యలో 21 శాతం వృద్ధి నమోదైంది. అలాగే గతంలో నెలకు సగటున రూ.193 కోట్లు ఖర్చు కాగా, కూటమి పాలనలో నెలవారీ ఖర్చు రూ.310 కోట్లకు చేరడంతో 60 శాతం పెరుగుదల నమోదైంది. ఈ విధంగా నెలవారీగా రూ.177 కోట్ల అదనపు ఖర్చుతో కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం కంటే ఏడాదికి రూ.2,124 కోట్లు ఎక్కువగా వ్యయం చేస్తోందని మంత్రి తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో మొత్తం రూ.11,577 కోట్లు ఖర్చు చేయగా, కూటమి ప్రభుత్వం గత 19 నెలల్లోనే రూ.6,530 కోట్ల వ్యయాన్ని నమోదు చేసింది. ఇది గత ప్రభుత్వ ఐదేళ్ల మొత్తం వ్యయంలో 56 శాతం కావడం గమనార్హం. పెరుగుతున్న ఖర్చు, లబ్ధిదారుల సంఖ్య ఈ పథకం పట్ల ప్రజల సానుకూల వైఖరికి అద్దం పడుతుందని మంత్రి వివరించారు. 108 సేవలకు సంబంధించి గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం కఠినమైన టెండర్ నిబంధనలను రూపొందించింది. ఫలితంగా గతేడాది జూన్ నుంచి 108 వాహనాలు 'గోల్డెన్ అవర్' (గంటలోపు ఆసుపత్రికి చేర్చడం) నిబంధనను సమర్థవంతంగా అమలు చేస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో 18 నిమిషాల్లో చేరాల్సి ఉండగా సగటున కేవలం 37 సెకన్లు, గ్రామీణ ప్రాంతాల్లో 23 నిమిషాలకు గాను కేవలం 13 సెకన్ల ఆలస్యంతోనే వాహనాలు చేరుతున్నాయి. గిరిజన ప్రాంతాల్లో అయితే 33 నిమిషాల గడువు కంటే 2 నిమిషాల 34 సెకన్లు ముందే అంబులెన్సులు చేరుతుండటంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో 108 అంబులెన్సుల పనితీరుపై కాగ్ తీవ్రమైన ఆరోపణలు చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. నిర్దేశిత సమయంలో వాహనాలు చేరకపోవడం, ఏసీలు పనిచేయకపోవడం, సిబ్బంది కొరత మరియు ప్రతిరోజూ సగటున 200 ఎమర్జెన్సీ కాల్స్‌కు అరబిందో సంస్థ స్పందించలేదని కాగ్ నివేదిక ఎత్తిచూపింది. గత ఏజెన్సీ నిర్వహణ లోపం వల్ల 42 వాహనాలు పూర్తిగా పాడైపోగా, 615 వాహనాలకు మేజర్ రిపేర్లు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల ఈ ఏడాది నవంబర్ నాటికి వంద శాతం 108 అంబులెన్సుల ద్వారా సేవలు అందుతున్నాయని అధికారులు తెలిపారు. టెండర్లలో కూడా అంబులెన్సులు నడిపిన అనుభవం, వార్షిక ఆదాయ పరిమితిని పెంచడంతో పాటు ప్రతి అంబులెన్స్‌కు ఇద్దరేసి టెక్నీషియన్లు, డ్రైవర్లు ఉండాలని నిబంధన విధించినట్లు మంత్రి వెల్లడించారు. త్వరలో 104 వాహనాల ద్వారా ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దే 41 రకాల వైద్య పరీక్షలు చేస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.



# పట్టుదలతో లక్ష్యం సాధ్యం: జిల్లా కలెక్టర్





**నంద్యాల,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని కృషి, పట్టుదల, నేర్చుకోవాలనే తపనతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చని జిల్లా కలెక్టర్ జి. రాజ కుమారి పేర్కొన్నారు.శనివారం నంద్యాల పట్టణంలోని బొమ్మల సత్రం సమీపంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌ను కలెక్టర్ సందర్శించారు.వంద రోజుల ప్రణాళికలో భాగంగా పదో తరగతి విద్యార్థుల స్టడీ అవర్స్‌ను స్వయంగా పరిశీలించారు. ముందు సావిత్రిబాయి పూలే 195వ జయంతిని పురస్కరించుకొని వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతున్న నేపథ్యంలో ఏ అంశం అర్థం కాకపోతే ఉపాధ్యాయులను నిర్భయంగా ప్రశ్నించి తెలుసుకునే తత్వం అలవర్చుకోవాలని,తద్వారా పరీక్షల్లో మెరుగైన మార్కులు సాధించవచ్చని అన్నారు. సబ్జెక్టులను యాంత్రికంగా కాకుండా వాటి సారాంశాన్ని లోతుగా అవగాహన చేసుకొని పాఠ్యపుస్తకాలను పఠనం చేయడం ద్వారా ఉన్నత విద్యకు పునాది పడుతుందని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.అలాగే జిల్లాలోని 281 పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలకు అన్ని శాఖల అధికారులను నియమించి నిరంతర పర్యవేక్షణలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఇందులో భాగంగానే తనకు కేటాయించిన ఏపీ మోడల్ స్కూల్ ను సందర్శించి విద్యార్థులతో అభ్యాసన పద్ధతులపై ముచ్చటించడం జరిగిందన్నారు.అనంతరం సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని పాఠశాలలో సేవలందిస్తున్న మహిళా ఉపాధ్యాయులను జిల్లా కలెక్టర్ సన్మానించారు. అలాగే జిల్లా స్థాయి స్పెల్ బీ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన ఆదర్శ పాఠశాల విద్యార్థులు లోకేష్, షారా లను మోమెంటో, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో డీఈఓ జనార్దన్ రెడ్డి, ఎస్ఎస్ఏ పీఓ నిత్యానంద రాజు, పాఠశాల ప్రిన్సిపల్ పి.ఎన్. మల్లికార్జునప్పతో పాటు ఇతర అధికారులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మీదనీ తండా గిరిజనులకు ఇండ్లు వెంటనే నిర్మించి ఇవ్వాలి

**తెలంగాణ గిరిజన సంఘం**




**హైదరాబాద్, స్నేహిత ఎక్స్ ప్రెస్:** కంచన్బాగ్ డివిజన్ మిధాని తండా బస్తీలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు వి.రామ్ కుమార్ నాయక్,సిఐటియు జిల్లా కార్యదర్శి సభావట్ కిషన్ నాయక్, మాట్లాడుతూ..అనేక సంవత్సరాల నుండి హైదరాబాదులో రిక్షా తోలుతూ అడ్డా మీద కూలీలుగా ఉంటూ ఇంట్లో పాచి పని చేసుకుంటూ పండ్లు కూరగాయలు అమ్ముకుంటూ కాలం ఎలా చూస్తున్న గిరిజనులు దాదాపుగా 30 సంవత్సరాల పైబడిన వారికి ఏ ప్రభుత్వం సహకరించలేదు ఇండ్లు కట్టి ఇవ్వాలని ఉన్న వాళ్లకు ఇండ్లు ఇవ్వలేదు.గత ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ ఇండ్లు అన్న అందలేదు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అంటుంది కానీ రోడ్డు పక్కన చెత్తకుండీ దగ్గర అనేక రకాలుగా ఇబ్బంది పడుకుంటూ గుడిసెలు వేసుకుని జీవిస్తున్న వారికి పట్టించుకునే నాధుడే లేడు ప్రభుత్వ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన అది నిర్లక్ష్యం వహిస్తూ కాలం వెళ్ళదీస్తున్నారు.కనుక తక్షణమే మిధాని తండా గిరిజనులకు గుర్తించి ఇల్లు కట్టి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సభ వెంకట్ రాములు, కాట్రావత్ బాలు నాయక్, నేనావత్ రవి నాయక్,హనుమాన్ నాయక్,మూర్తి రామ్,శ్రీను,లక్ష్మణ్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.


## రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** పెద్దేముల్ గ్రామ రైతుల సమస్యలు పరిష్కరించడానికి తాము ఎల్లప్పుడూ ముందుంటామని పెద్దేముల్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ డివై చిన్న నర్సింహులు,ఉప సర్పంచ్ డివై ప్రసాద్ లు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో పోచమ్మ దేవాలయ పరిసర ప్రాంతాల్లో పంట పొలాలు ఉన్న రైతులు విన్నవించిన సమస్యలను శ్రద్ధగా విని వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తామని రైతులకు హామీఇచ్చారు.ఈ సందర్భంగా పెద్దేముల్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ డివై చిన్న నర్సింహులు,ఉప సర్పంచ్ డివై ప్రసాద్ లు మాట్లాడుతూ..పెద్దేముల్ గ్రామంలో నివసిస్తున్న రైతుల సమస్యలను పరిష్కరించడానికి పెద్దేముల్ గ్రామపంచాయతీ పాలకమండలి తరపున తాము ఎల్లప్పుడూ ముందుంటామని అన్నారు.పెద్దేముల్ గ్రామంలో గ్రామ కంఠం పరిధిలో రైతులకు ఉన్న సమస్యలను పరిష్కరించడానికి తాము ఎల్లప్పుడూ రైతుల పక్షాన ఉంటామని అన్నారు. పోచమ్మ దేవాలయ పరిసర ప్రాంతాల్లో పంట పొలాలు ఉన్న రైతుల సమస్యలు తమ దృష్టికి వచ్చాయని వాటిని పరిష్కరించడానికి మా వంతుగా ప్రయత్నిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దేముల్ మేజర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ డివై ప్రసాద్,వార్డు సభ్యులు ఎర్ర వెంకట్, రొంపల్లి మల్లప్ప, పెద్దేముల్ మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి లాలప్ప, కారోబార్ నర్సిరెడ్డి, రైతులు దరిమీది వెంకటయ్య,దరిమీది మానెప్ప, గౌరప్ప, కోడి కృష్ణ,నీలి విఠల్,దరిమీది కిష్టప్ప, కోళ్ల గోపాల్,చింటు,తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్గా గెలిచి.ప్రజల త్రాగు నీటి వైపు తొలి అడుగు.

**బోర్లు,పైపులైన్లు మరమ్మత్తులు చేయించిన సర్పంచ్ లోని జగన్**





**కోటగిరి, స్నేహిత ఎక్స్ ప్రెస్:** ఇటీవల జరిగిన ఎన్నికల ప్రచా రంలో భాగంగా ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి గ్రామ అభివృద్దే ధ్యేయంగా పోతంగల్ మండలంలోని కొల్లూర్ గ్రామ నూతన సర్పంచ్ లోని జగన్ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గత కొన్ని నెలలపాటుగా గ్రామంలో నెల కొన్న త్రాగు నీరు సమస్యపై సర్పంచ్ ప్రత్యేక దృష్టి సారించి తన గ్రామ అభివృద్ధికి తొలి అడుగు వేశారు.గ్రామంలో 3 సింగిల్ మోటార్లు అలాగే 2 త్రీఫేస్ మోటార్లను బాగుచేయిం చి ప్రజలకు త్రాగు నీరు సమస్యను పరిష్కరించారు.గ్రామం లో అస్తవ్యస్తంగా లీకేజీలతో కూడియున్న పైపు లైన్లను మర మత్తులు చేశారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు సర్పంచ్ పని తీరుపై హర్షం వ్యక్తం చేస్తూ..అభినందనలు తెలియ జేస్తున్నారు.

## పిఆర్టియు టీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



**చౌడాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** చౌడాపూర్ మండల కేంద్రంలోని పీఆర్టీయు మండల శాఖ ఆధ్వర్యంలో పీఆర్‌టీయు నూతన సంవత్సర క్యాలెండర్ ను ఎంపీడీఓ సోమలింగం, తహసిల్దార్ వెంకటేశ్వర్లు,ఎంఈఓ రాంచందర్,ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో పి.ఆర్.టి.యు మండల అధ్యక్షుడు మొహమ్మద్ గులాం,ప్రధాన కార్యదర్శి దస్సయ్య,పిఆర్టియు సభ్యులు వివిధ తదితరులు పాల్గొనడం జరిగింది.

## అడవి వేంకటాపూర్‌లో సావిత్రి బాయి పూలే జయంతి

**సావిత్రిబాయిని ఆదర్శంగా తీసుకోవాలి సర్పంచ్ రవి నాయక్**

**చౌడాపూర్, స్నేహిత ఎక్స్ ప్రెస్:** చౌడాపూర్ మండలం అడవి వేంకటాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సామాజిక నాయకురాలు సావిత్రి బాయి పూలే జయంతి ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నేనావత్ రవి నాయక్, ఉప సర్పంచ్ కిషన్ నాయక్, పాఠశాల ఉపాధ్యాయులు రాజు,అర్చన,జయ,గ్రామ కార్యదర్శి రాములు, గ్రామ అధ్యక్షులు రవీందర్, మాజీ అధ్యక్షులు చుక్కయ్య,వార్డు సభ్యులు ఖాజా తదితరులు పాల్గొన్నారు.




## విద్యా అసమానతలను నిర్మూలించడమే సావిత్రిబాయి పూలేకు అర్పించే నిజమైన నివాళి




- **ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలి**
- **విద్యాహక్కు చట్టాన్ని ప్రభుత్వం పటిష్టంగా అమలు చేయాలి**
- **ప్రజా సంఘాలు డిమాండ్**

**హైదరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

దేశవ్యాప్తంగా పెరుగుతున్న విద్యా అసమానతల నిర్మూలన కొరకు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టాన్ని తేవాలని, విద్యాహక్కు చట్టాన్ని అన్ని విద్యా సంస్థలలో పగడ్బందీగా అమలుకు చేయడం ద్వారానే అసమానతలు నిర్మూలన జరుగుతుందని అదే సావిత్రిబాయి పూలే కు అర్పించే నిజమైన నివాళి అని ప్రజాసంఘాల నేతలు పిలుపునిచ్చారు.సావిత్రిబాయి పూలే 195వ జయంతి వేడుకల సందర్భంగా బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్క్ వద్ద ఆమెకు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్,తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరామ్ నాయక్,తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ప్రసాద్,డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్,చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ నాయకులు నాగరాజు ఘనమైన నివాళి అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత దేశంలో అట్టడుగు వర్గాల నుంచి మొట్టమొదటి మహిళా టీచర్ గా పని చేసిన సావిత్రిబాయి పూలే అట్టడుగు వర్గాలుగా ఉన్న దళితులు గిరిజనలు బలహీన వర్గాల కు చెందిన మహిళలకు చదువు అందించుటలో కీలక పాత్ర పోషించారని చెప్పారు. సమాజంలో ఉన్నత వర్గాల నుండి అనేక వేధింపులను అవమానాలను ఎదుర్కొంటూనే అట్టడుగు వర్గాలను చైతన్యవంతం చేసే దానిలో కీలక పాత్ర పోషించిందని చెప్పారు కుల వివక్ష అంటరానితనం కు వ్యతిరేకంగా అనేక పోరాటాలను చేశారని చెప్పారు. నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న సరళీకరణ ప్రైవేటికరణ విధానాలు వలన సామాజికంగా ఆర్థికంగా వెనకబడిన తరగతులకు విద్య అందుబాటులో లేకుండా పోయింది అన్నారు. డబ్బున్న వాళ్లకే నాణ్యమైన విద్య అందించే విధంగా కేంద్ర బిజెపి ప్రభుత్వం నూతన విద్యా చట్టం తీసుకొచ్చిందని అన్నారు.ఈ చట్టం వలన దేశంలో శాస్త్రీయ భావాలు కనుమరుగై మూఢనమ్మకాలు, మనువాద భావాలను విద్యార్థుల మెదడులలో నింపే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు.

బాలికలలో ప్రాథమిక విద్యలోనే డ్రాప్ అవుట్సు పెరుగుతున్నాయని ప్రభుత్వ విద్య పూర్తిగా నీరుగారి పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తేవాలని డిమాండ్ చేశారు. వామపక్షాలు ప్రజా సంఘాలు చేసిన అనేక పోరాటాల ఫలితంగా వచ్చిన విద్యా హక్కు చట్టం అమలు జరగడంలేదన్నారు .దీని అమలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## జల్లాపల్లి ఆబాదిలో వినూత్న పాలనకు శ్రీకారం....!




- **ఆడబిడ్డ పుడితే రూ.2100 ఆర్థిక సాయం!**
- **ఆడబిడ్డ పెళ్లికి రూ.5000 ఆర్థిక భరోసా**
- **సర్పంచ్ బర్మవత్ వివేక్ తొలి అడుగుకు హర్షిస్తున్న గ్రామ ప్రజలు**

**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం పోతంగల్ మండలంలోని జల్లాపల్లి ఆబాది గ్రామ సర్పంచ్గా మరోమారు బర్మవత్ వివేక్ బాధ్యతలు స్వీకరించి తన మార్క్ పాలనను కొనసాగిస్తున్నారు.ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఆయన ఒక్కొక్కటిగా బాధ్యతాయుతంగా అమలు చేస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఇటీవల కాలంలో గ్రామపంచాయతీ సర్పంచ్గా మరోమారు ప్రమాణ స్వీకారం చేసిన వివేక్ వెంటనే ఎన్నికల సమయం లో ప్రజలకు ఇవ్వని హామీలను అమలు చేస్తానంటు సరి కొత్త పంథాలో ఆయన గ్రామ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. గ్రామంలో ఆడబిడ్డ పుట్టిన కుటుంబానికి రూ.5000/ ఆర్థిక సహాయం అందజేస్తానని.అలాగే గ్రామంలోనీ ఆడబిడ్డ పెళ్లికి రూ.2100 ఆర్థిక భరోసాను కల్పిస్తానని అంటున్నారు.సమాజంలో ఆడబిడ్డల పట్ల గౌరవం,ప్రోత్సాహకం ఉండాల నే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి అండదండలతో గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన,సీసీ రోడ్లు, డ్రైనేజీలు,రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించడంలో నిర్విరామంగా కృషి చేస్తానని అంటున్నారు.ఎన్నికల హామీలను కొందరు ప్రకటనలకు మా త్రమే పరిమితమైతే ఈయన మాత్రం ఎన్నికలలో ఇచ్చిన హామీలతో పాటుగా ఇవ్వని హామీలను కూడా కార్యరూపంలో చూపిస్తున్న సర్పంచ్ వివేక్ చర్యల పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు.



## విద్యార్థులు ఇష్టపడి చదివితేనే మంచి ఫలితాలు

- **10వ తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించాలి**
- **సబ్ కలెక్టర్ ఉమా హారతి**



**నారాయణఖేడ్, స్నేహిత ఎక్స్ ప్రెస్:** విద్యార్థులు కష్టపడి మాత్రమే కాకుండా ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని నారాయణ ఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి అన్నారు. శనివారం నారాయణఖేడ్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎనిమిదో తరగతి విద్యార్థులతో కలిసి బయాలజీ పాఠ్యాంశానికి సంబంధించిన పలు ప్రశ్నలు అడిగి వారి ప్రతిభను పరిశీలించారు.అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన సబ్ కలెక్టర్, పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే కష్టపడి చదవాల్సిందే అని సూచించారు. మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు,ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను ప్రోత్సహించారు.అదేవిధంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ..సమయపాలన తప్పనిసరిగా పాటించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పదో తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఇప్పటి నుంచి ప్రతి వారం ఒకసారి పాఠశాలను సందర్శిస్తానని వెల్లడించిన సబ్ కలెక్టర్,విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చి చెప్పవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలే 195 వ జయంతి వేడుకలు

- **పూలే నేటి మహిళ ఉపాధ్యాయులకు ఆదర్శం: ఎంఈఓ శ్రీనివాసరావు**




**కోటగిరి, స్నేహిత ఎక్స్ ప్రెస్:** భారత తొలి మహిళా ఉపాధ్యా యురాలు సావిత్రిబాయి పూలే నేటి మహిళా ఉపాధ్యాయులు,మహిళలకు ఆదర్శప్రాయమని కోటగిరి మండల ఎంఈఓ నాదెండ్ల.శ్రీనివాసరావు పేర్కొన్నారు.శనివారం కోటగిరి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ కోటగిరి పాఠశాల ఆవరణంలో పిఆర్టియు కోటగిరి మండల శాఖ ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే 195 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పలువురు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం మండల మహిళా ఉపాధ్యాయులకు ఎంఈఓ ఎన్.శ్రీనివాస్ రావు ఘనంగా సన్మానించారు.తదనంతరం కోటగిరి మేజర్ గ్రామ పంచాయతీ నూతన సర్పంచ్ బర్ల మధుకర్ కు సన్మానించా రు.ఈ కార్యక్రమంలో కోటగిరి మండల పిఆర్టియు శాఖ అధ్యక్షులు బర్ల సాయిలు,ప్రధాన కార్యదర్శి డి.ఉదయ చందర్,రాష్ట్ర,జిల్లా,మండల బాధ్యులు, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అదుపుతప్పి ఇసుక ట్రాక్టర్ బోల్తా...!

- **ఎలాంటి ప్రమాదాలు కాకపోవడంతో ఉపిరి పీల్చుకున్న ప్రజలు**
- **అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘాతో నిలువరించాలి**
- **పర్మిషన్లతో నడిచే ఇసుక టాక్టర్లకు కళ్లెం వేయాలి**
- **ఉమ్మడి కోటగిరి,పోతంగల్ మండల ప్రజల డిమాండ్**



**కోటగిరి, స్నేహిత ఎక్స్ ప్రెస్:** రాత్రి వేళ,సెలవు దినాలలో అక్రమంగా నడిచే ఇసుక రవాణాను నియంత్రించలేకున్న పర్మిషన్లతో నడుస్తున్న ఇసుక ట్రాక్టర్ల రవాణాకు కళ్లెం వేసి జరగబోయే ప్రమాదాలను నివారించాలని ఉమ్మడి కోటగిరి మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.శనివారం కోటగిరి మండల కేంద్రంలో మితిమీరిన వేగంతో ఇసుక ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాకొట్టిన ఘటన చోటు చేసుకుంది.వివరాలలోకి వెళితే. పోతంగల్ మండలంలోని కొడిచర్ల గ్రామ శివారు నుంచి వయా పొతంగల్,కోటగిరి మీదుగా రాంపూర్ గ్రామం వైపుగా ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ సమీపంలో కోటగిరి ప్రధాన రహదారిపై ఇసుక ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా కొట్టింది.ఈ ఘటన లో ఎవరికి ఏలాంటి గాయాలు,ప్రమాదా లు జరగ కపోవడంతో ప్రజలు ఉపరిపించుకున్నారు.రాత్రి,పగలనే తేడాలు లేకుండా,సెలవు దినాలు అనే పట్టింపు లేకుండా ఇష్టానుసారంగా ఇసుక ట్రాక్టర్లు,టిప్పర్లు రవాణా సాగిస్తున్నయ ని.ఇకనైనా సంబంధిత అధికారులు అక్రమ ఇసుక రవాణాను నిల్వరించక పోయిన,పర్మిషన్లతో నడిచే ఇసుక ట్రాక్టర్ల ఓవర్ లోడ్,ఓవర్ స్పీడ్,డ్రైవర్ల నిర్లక్ష్యం వైఖరి వంటి విషయాలను పరిగణలోకి తీసుకొని ట్రాక్టర్లకు కళ్లెం వేయాలని ప్రజలు బహిరంగంగా కోరుతున్నారు.

## ఘనంగా యువ నాయకుడు బోవోల్ల విజయ్ కుమార్ పుట్టినరోజు వేడుకలు

- **సందడి చేసిన కాంగ్రెస్ జెండా**
- **పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న ప్రముకులు**



**మోమిన్ పేట్, స్నేహిత ఎక్స్ ప్రెస్:** వికారాబాద్ జిల్లా మోమిన్ పేట్ మండల పరిధిలోని వెల్చాల్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు బోవోల్ల విజయ్ కుమార్ పుట్టినరోజు వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై సంబరాలను అంగరంగ వైభవంగా జరిపారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి విజయ్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సేవలో ముందుండే యువ నాయకుడిగా గుర్తింపు పొందిన బోవోల్ల విజయ్ కుమార్ సేవలను పలువురు నాయకులు కొనియాడారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడిన బోవోల్ల విజయ్ కుమార్,తనపై నమ్మకం ఉంచి ఎల్లప్పుడూ అండగా నిలిచిన పార్టీ నాయకులు,కార్యకర్తలు, బంధుమిత్రులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను గ్రామగ్రామాన విస్తరించేందుకు మరింత అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. ఉత్సాహభరిత నినాదాలు,అభినందనల మధ్య ఈ పుట్టినరోజు వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

## నారీశక్తి సంస్థ అధ్యక్షురాలు జ్యోతి పండాల్'ను సన్మానించిన బీసీ మహిళా సంఘం



**సంగారెడ్డి, స్నేహిత ఎక్స్ ప్రెస్:** తెలంగాణ రాష్ట్ర బీసీ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించిన భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే 195 వ రాష్ట్రస్థాయి జయంతి ఉత్సవంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నారీశక్తి సంస్థ అధ్యక్షురాలు, జహీరాబాద్ నియోజకవర్గం ముద్దుబిడ్డ జ్యోతి పండాల్'ను బీసీ మహిళా సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. మహిళా నాయకురాలుగా మహిళల హక్కుల పరిరక్షణ,రాజకీయ నాయకురాలిగా నిస్వార్థ ప్రజాసేవ చేస్తున్న నారీశక్తి సంస్థ అధ్యక్షురాలు జ్యోతి పండాల్ సామాజిక సేవను గుర్తించిన బీసీ మహిళా సంక్షేమ సంఘం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా సావిత్రిబాయి పూలే అవార్డుతో ప్రజాబంధు జ్యోతి పండాల్'ను సత్కరించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. సావిత్రిబాయి పూలే అవార్డ్ సన్మాన గ్రహీత జ్యోతి పండాల్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ప్రజలకు జాతీయ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేసి, శ్రీమతి సావిత్రిబాయి పూలే నిస్వార్థ దేశభక్తిని స్మరించుకుంటూ.. సావిత్రిబాయి పూలే భారతదేశపు మొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా, ఆధునిక విద్యావేత్తగా, కుల వివక్షకు వ్యతిరేకంగా, స్త్రీ విముక్తి కోసం, వితంతు పునర్వివాహాల కోసం కృషిచేసిన ఆదర్శమూర్తని, 'సత్యశోధక్ సమాజ్' కార్యకలాపాలతో "భారతదేశ స్త్రీవాద పితామహురాలు"గా ప్రజల హృదయాల్లో కొలువైన ప్రజానాయకురాలని, దళిత బహుజన, స్త్రీ జనోద్ధరణకు మరియు మహిళా సాధికారతకు తమ జీవితాన్ని అంకితం చేసిన త్యాగమూర్తని, తమ జీవితమంతా మహిళల హక్కుల పరిరక్షణ కోసం నిస్వార్థంగా కృషిచేసి భారతదేశ మహిళల కీర్తిప్రతిష్టలను విశ్వవ్యాప్తం చేసి మహిళలకు గర్వకారణంగా నిలిచిన మహా నాయకురాలని, మానవతా విలువల కలిగిన మాతృమూర్తి,సావిత్రి బాయి పూలే, జయంతి సందర్భంగా తెలంగాణ బిసి మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీమతి సావిత్రిబాయి పూలే అవార్డును వరుసగా మూడవ సారి అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.

## ఉస్మానియా యూనివర్సిటీలో బీఎస్పీ వీరుడు తలారి రాజేష్‌కు ఘన సన్మానం


- **బీఎస్పీ తరుపున వార్డు మెంబర్ గా జయకేతనం**
- **అభినందించిన సెంట్రల్ కో ఆర్డినేటర్ అత్తర్ సింగ్**
- **రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రామ్ శేఖర్**




**మోమిన్ పేట్, స్నేహిత ఎక్స్ ప్రెస్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బహుజన్ సమాజ్ పార్టీ తరఫున గెలిచిన అభ్యర్థులతో పాటు ఓడిన అభ్యర్థులను కూడా మంగళవారం రోజున హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలోని నాన్ టీచింగ్ హాల్‌లో ఘనంగా సన్మానించారు. ప్రజాసేవ లక్ష్యంగా పోటీ చేసి బహుజన ఉద్యమానికి అంకితభావంతో పనిచేసిన ప్రతి ఒక్కరికి గౌరవం ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..ఎన్నికల్లో గెలుపు - ఓటములు తాత్కాలికమేనని, కానీ బహుజన సిద్ధాంతాల కోసం పోటీ చేయడమే నిజమైన విజయం అని పేర్కొన్నారు. గెలిచిన వారితో పాటు ఓడిన అభ్యర్థులను కూడా సన్మానించడం ద్వారా పార్టీ ఐక్యత, సమానత్వం,పోరాట స్ఫూర్తిని చాటిందన్నారు.ఈ కార్యక్రమం బహుజన శక్తికి ప్రతీకగా నిలిచిందని,పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని కార్యకర్తలు తెలిపారు.ఈ సన్మాన కార్యక్రమంలో బీఎస్పీ సెంట్రల్ కోఆర్డినేటర్ మాజీ ఎమ్మెల్సీ అత్తర్ సింగ్,సురేష్,ఆర్య రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రామ్ శేఖర్,దయానంద్ రావు,కో ఆర్డినేటర్ చంద్రశేఖర్ ముదిరాజ్,బాలయ్య,నిషాని రామచంద్రం వికారాబాద్ జిల్లా ఇంచార్జి సయ్యద్ అమీర్, వికారాబాద్ అసెంబ్లీ అధ్యక్షులు గుజ్జరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మరికల్ పాఠశాలలో సావిత్రి బాయి ఫూలే జయంతి వేడుకలు

- **సావిత్రిబాయి జయంతి సందర్భంగా విద్యార్థులకు పుస్తకాల పంపిణీ**




**చౌడాపూర్, స్నేహిత ఎక్స్ ప్రెస్:** చౌడాపూర్ మండల పరిధిలోని మరికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత సంఘసంస్కర్త తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా సావిత్రి బాయి పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి వారి ఆశయాలను కొనియడం జరిగింది.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల పాఠశాల ఉపాధ్యాయుల బృందం,విద్యార్థులు,తదితరులు పాల్గొనడం జరిగింది.

## ప్రజా భద్రత యువత రక్షణకు ప్రత్యేక తక్షణ చర్యలు

- **ఎస్ఐ శంకర్**



**అల్లాదుర్గం, స్నేహిత ఎక్స్ ప్రెస్:** ప్రజా భద్రత యువత రక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు,డాగ్ స్క్వాడ్ అధికారులు,అ ఎస్ఐ శంకర్ ఆధ్వర్యంలో సిబ్బంది కలిసి అల్లాదుర్గం ఐబీ చౌరస్తా పరిధిలోని కిరణా షాపులు,కల్లు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా ఏవైనా మత్తు పదార్థాలను - గంజాయి, నకిలీ మందులు లేదా నిషేధిత డ్రగ్‌లు - విక్రయిస్తున్న దుకాణాలను గుర్తించడమే ప్రధాన ఉద్దేశ్యం. స్థానిక దుకాణాల యజమానులను కఠినంగా హెచ్చరించి, చట్టపరమైన చర్యలు తీసుకోవడం తప్పనిసరిగా ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు.డాగ్ స్క్వాడ్ తనిఖీ క్రమంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ, మత్తు పదార్థాల ప్రమాదాలు, చట్టపరమైన పరిణామాలపై ప్రత్యేకంగా వివరించారు.పోలీసులు గుర్తించిన ఏవైనా ఉల్లంఘనలు వెంటనే కేసు నమోదు చేసి, కఠిన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.ఈ చర్యల ద్వారా యువతను మత్తు పదార్థాల ప్రభావం నుండి రక్షించడమే కాకుండా, ప్రజలలో చట్టాన్ని గౌరవించాలనే సందేశాన్ని కూడా స్పష్టంగా ప్రసారం చేశారు.స్థానికులు,వ్యాపారులు కూడా పోలీసుల ఈ చర్యలను స్వాగతిస్తూ, చట్టపరమైన నియమాలు పాటించడంలో మద్దతు వ్యక్తం చేశారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే జన్మదిన వేడుకలు

**అల్లాదుర్గం, స్నేహిత ఎక్స్ ప్రెస్:** అల్లాదుర్గం మండలంలోని ముస్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రమేష్ మాట్లాడుతూ..గొప్ప సంఘ సేవకురాలు, అనుగారిన వర్గాల కోసం కృషి చేసిన వీరవనిత సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. ఆనాటి కాలంలో బడుగు బలహీన వర్గాల కోసం అక్షయ జ్ఞానం నేర్పి చక్కటి మార్గంలో నడిపించారని బాలికలకు ప్రత్యేక పాఠశాలలు నెలకొల్పి విద్య గొప్పతనాన్ని చాటి చెప్పిన త్యాగశీలి అని కొనియాడారు.ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# విద్యతో విముక్తి దీపం వెలిగించిన మహనీయురాలు

- **స్త్రీ అంటే ఓ నీడ కాదు..ఓ సృష్టికర**
- **మహిళా ఉపాధ్యాయులకు సన్మానం**

**చౌడాపూర్, స్నేహిత ఎక్స్ ప్రెస్:** చౌడాపూర్ మండల కేంద్రంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా చౌడాపూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పవన్ కుమార్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పాఠశాల మహిళ ఉపాధ్యాయులకు శాలువాలతో పూలదండలతో సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే భారతదేశ సామాజిక చరిత్రలో ఆమె చేసిన విప్లవాత్మక పోరాటాన్ని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యం.మహిళా విద్య, సామాజిక సమానత్వం, మానవత్వం కోసం ఆమె సాగించిన పోరాటం తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తోంది అన్నారు. "స్త్రీ అంటే ఓ నీడ కాదు.ఓ సృష్టికర్త" అనే భావనను తన రచనలు, జీవితం ద్వారా ప్రపంచానికి చాటి చెప్పిన తొలి రచయిత్రి సావిత్రిబాయి పూలే. 195 ఏళ్ల క్రితం సావిత్రిబాయి వెలిగించిన "విద్యే విముక్తి మార్గం" అనే దీపం నేటికీ సమాజాన్ని వెలుగులోకి నడిపిస్తోంది. మహిళ చేతిలో పుస్తకాన్ని పెట్టి, విద్యనే ఆయుధంగా అందించిన మహనీయురాలు ఆమె.ఆ కాలంలో మహిళా విద్యపై ఉన్న అపోహలను, అణచివేతలను ఎదుర్కొంటూ ఆమె చేసిన పోరాటం చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడింది.భర్త జ్యోతిరావు పూలేతో కలిసి దేశంలో తొలి బాలికల పాఠశాలను స్థాపించి, మహిళా విద్యకు బాటలు వేసిన గొప్ప సంస్కర్త సావిత్రిబాయి. సమాజంలోని అసమానతలను ప్రశ్నించేందుకు కలాన్ని ఆయుధంగా మలిచిన తొలి కవయిత్రిగా ఆమె విశిష్ట స్థానం సంపాదించారు. మానవత్వానికి నిలువెత్తు ప్రతీకగా నిలిచిన సావిత్రిబాయి పూలే, విద్య, సమానత్వం,సామాజిక న్యాయం కోసం జీవితాంతం అంకితమయ్యారు.ఆమె ఆశయాలు,ఆలోచనలు నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తూ, రేపటి సమ సమాజ నిర్మాణానికి దిశానిర్దేశం చేస్తున్నాయి అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పవన్ కుమార్, ఉపాధ్యాయులు నర్సింలు,నగేష్,శ్రావణి, సుకన్య జంగమ్మ అనూష దీప,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఒక్క విద్యార్థిని సావిత్రిబాయి పూలేని ఆదర్శంగా తీసుకోవాలి




- **చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు**
- **విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సావిత్రిబాయి పూలేజయంతి**
- **ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**

**నందికొట్కూర్, స్నేహిత ఎక్స్ ప్రెస్:**

నందికొట్కూరు పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల,కళాశాలల్లో ఎఐఎఫ్ డిఎస్,ఎవిఎస్ విద్యార్థి సంఘాల నాయకులు రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు,రాష్ట్ర కార్యదర్శి డక్క కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, హాజరై సావిత్రిబాయి పూలే చిత్రానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ.. మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా ఎన్నో కష్టాలను నష్టాలను ఎదుర్కొని ఉపాధ్యాయురాలుగా బడుగు బలహీన వెనుకబడిన వర్గాలకు అక్షరాభ్యాసం అందించి మహిళలు చదువులో కూడా ఉన్నత స్థానాల్లో ఉండొచ్చని ప్రతి మహిళలో ధైర్యం నింపి ఆదర్శంగా సావిత్రిబాయి పూలే నిలిచారన్నారు. కాబట్టి ప్రతి ఒక్క విద్యార్థిని సావిత్రిబాయి పూలే ని ఆదర్శంగా తీసుకుని ఎటువంటి సమస్యలు ఉన్న వాటిని ఎదుర్కొని ఉన్నత చదువులు చదివి మీయొక్క గమ్యాలను చేరాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎంపీ బైరెడ్డి శబరి ముందస్తు జన్మదిన సందర్భంగాటీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగానిర్వహించారు.ఈ కార్యక్రమంలో నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, కౌన్సిలర్ లాలు,పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపల్,ఉపాధ్యాయురాలు,టిడిపి నాయకులు,బెస్త అశోక్ కుమార్ (ఎఐఎఫ్డిఎస్ నియోజకవర్గ కార్యదర్శి ) ఎన్డీకే పాలెం బైరెడ్డి యూత్ మేఘనాథ్,స్వామినాథం,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కూటమీ ప్రభుత్వ లక్ష్యం




- **ప్రభుత్వ పథకాలు గ్రామస్థాయికు చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యం**
- **రాజముద్రతో నూతన పట్టాదారు పాసు పుస్తకాలు రైతులకు పంపిణీ**
- **ఎమ్మెల్యే గిత్త జయసూర్య**

**నందికొట్కూర్, స్నేహిత ఎక్స్ ప్రెస్:**

నందికొట్కూరు నియోజకవర్గంపాములపాడు మండలం తుమ్మలూరు గ్రామంలో గ్రామ 2వ సచివాలయము నందు నిర్వహించిన రాజముద్రతో నూతన పట్టాదారు పాసుబుక్కుల పంపిణీ కార్యక్రమంలో మండల నాయకులతో కలిసి రైతులకు పాసుబుక్కులను నందికొట్కూరు నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్త జయసూర్య పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..వైసీపీ హయాంలో జగన్ బొమ్మతో భూమి హక్కు పత్రాలు, సర్వే రాళ్ళు ఉండటం..రీ సర్వే కూడా తప్పుల తడకగా ఉండటంతో రైతులు తీవ్ర నిరసన వ్యక్తం చేసారు. తాము అధికారంలోకి వస్తే రీసర్వే తప్పులను సరిదిద్ది ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలను ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.ఆ హామీని ఇప్పుడునెరవేర్చుతున్నారు అన్నారు.. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు గ్రామస్థాయికి చేరాలన్నదే కూటమి ప్రభుత్వ నిరంతర కృషి అని ఎమ్మెల్యే అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్,ప్రసాద్,వెంకటేశ్వర రెడ్డి, సత్యనారాయణ రెడ్డి,హరినాథ్ రెడ్డి, రామకృష్ణ,వెంకటస్వామి, మండల నాయకులు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## బండమిదిపల్లిలో నిఘా నెత్రాలు ఏర్పాటు



**పెద్దేముల్, స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండల పరిధిలోని బండమిదిపల్లిలో నూతన సర్పంచ్ మాన్యప్ప సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గ్రామ సంరక్షణకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ నిఘా నేత్రలు పెట్టడం జరిగిందని సర్పంచ్ మాన్యప్ప అన్నారు.గ్రామ పంచాయతిలో జరిగే ప్రతి సన్నివేశాలు రికార్డ్ అవుతాయి కాబట్టి ఎక్కడ కూడ అల్లర్లు జరగకుండా ప్రశాంతంగా గ్రామం ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ దేవాదాయ శాఖ అధ్యక్షులు తాండ్ర వీరన్న,గ్రామ పెద్దలు పోచారం రాములు, మున్నూరు నర్సిములు,బోయ లక్ష్మయ్య వార్డు సభ్యులు రమేష్,మున్నూరు సంగమేశ్వర్,సదబోయిన నారాయణ, నాయకులు,యువకులు,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి




**నర్సింహులపేట, స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండలంలోని గోప తండా పాఠశాలలో శనివారం సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి,ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళ ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. నిమ్న వర్గాల అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటం చేసి మహిళా విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన సామాజిక కార్యకర్త సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ అజ్మీరా రాజేందర్ నాయక్, హెచ్ఎం చంద్రకళ, ఉపసర్పంచ్ అజ్మీర ప్రమీల, కార్యదర్శి సలీమ, వార్డు సభ్యులు, ఐసిడిఎస్ అధికారులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంపీ సురేష్ షెట్కర్‌ను సన్మానించిన ఇటికేపల్లి నూతన సర్పంచ్ రాజు ముదిరాజ్



**జహీరాబాద్, స్నేహిత ఎక్స్ ప్రెస్:** జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్ ను జహీరాబాద్ క్యాంప్ కార్యాలయంలో రాయికోడ్ మండలానికి చెందిన నూతనంగా ఎన్నికైన ఇటికేపల్లి గ్రామ సర్పంచ్ రాజు ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎంపీ సురేష్ షెట్కర్ ను శాలువాతో సన్మానం చేశారు. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై ఎంపీతో సర్పంచ్ రాజు ముదిరాజ్ చర్చించారు. ఇటికేపల్లి గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి స్పందించిన ఎంపీ సురేష్ షెట్కర్, గ్రామ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రసాయన శాస్త్రంలో శ్రీధర్ రెడ్డికి పీహెచ్ డీ



**పటాన్ చెరు, స్నేహిత ఎక్స్ ప్రెస్:** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి శ్రీధర్ రెడ్డి తుమ్మల డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'శక్తివంతమైన క్యాన్సర్ నిరోధక కారకాలుగా పనిచేసే ట్రయాజోల్స్, టెట్రాజోల్స్, పైరజోల్స్ తో సహా అజోల్ హైబ్రిడ్ ల కోసం ఒక కొత్త సంశ్లేషణ పద్ధతి'పై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న రసాయన శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్ కొప్పుల శనివారం ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ శ్రీధర్ రెడ్డి పరిశోధన నూతన అజోల్ ఆధారిత హైబ్రిడ్ అణువుల సంశ్లేషణ,సంభావ్య క్యాన్సర్ నిరోధక ఏజెంట్లుగా వాటి మూల్యాంకనంపై దృష్టి పెట్టినట్టు వెల్లడించారు. బహుళ మానవ క్యాన్సర్ కణ తంతువులలో ప్రామాణిక రిఫరెన్స్ ఔషధాలతో పోలిస్తే అనేక సంశ్లేషణ సమ్మేళనాలు అత్యుత్తమ ఇన్ విట్రో యాంటీ క్యాన్సర్ కార్యాచరణను ప్రదర్శించినట్టు తెలిపారు. మాలిక్యులర్ డాకింగ్, ఇన్ సిలికో అడ్మెట్ అధ్యయనాలు వాటి బలమైన బైండింగ్ అనుబంధం, ఔషధ పోలిక, చికిత్సా సామర్థ్యాన్ని మరింత నిర్ధారించినట్టు వివరించారు. డాక్టర్ శ్రీధర్ రెడ్డి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు,గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా,రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియజేసినట్టు పేర్కొన్నారు.